క్లుప్తంగా

వైద్యశిబిరానికి స్పందన



రోగికి మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

నెల్లిమర్ల: పట్టణంలోని పెంతికోస్తు చర్చిలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 15వ వార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గంటా సత్యనారాయణ, చర్చి పాస్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో తగరపువలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య సేవలందించారు. అవసరమైన రోగులకు ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అందజేశారు.

26న విక్టరీ మీట్

భోగాపురం: విద్యా విధానంలో మార్పులతో పాటు విద్యార్థులు రాస్తున్న పరీక్షల్లో చక్కని ప్రతిభ చూపించే విధంగా ఈనెల 26న విక్టరీ మీట్-2023 కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిత్య సువార్త సహవాసం అధ్యక్షుడు అడ్డగర్ల నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ, భోగాపురం మేజర్ పంచాయితీ కోతమిల్లు పక్కన ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకు విక్టరీ మీట్ నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నిపుణులు పలిశెట్టి మోహన్, జె.ప్రశాంత్‌కుమార్ హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



నారాయణపురంలో ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరావు, తదితరులు

విజయనగరం రూరల్: స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత చేపట్టాలని ఎంపీడీఓ గంటా వెంకటరావు ఆదేశించారు. మండలంలోని బియ్యాలపేట, నారాయణపురం గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాలు, గ్రామ సచివాలయాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్రామ సచివాలయాల్లో ప్రజల నుంచి వచ్చే సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, నారాయణపురం, బియ్యాలపేట పంచాయతీ కార్యదర్శులు రవి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


యోగాతో మానసిక ఒత్తిడి దూరం



విద్యార్థులతో యోగా చేయిస్తున్న రామకృష్ణరాజు

బొండపల్లి: యోగాతో మానసిక,శారీరక ఒత్తిడిని అధిగమించవచ్చని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు అన్నారు.గొట్లాం గ్రామంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యోగా సాధనపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజూ కాస్త సమయం యోగాకు కేటాయించాలని సూచించారు. పరీక్షల సమయం దగ్గరపడుతున్న కొద్దీ భయం, మానసిక ఒత్తిడి ఎక్కువ అవుతుందని, యోగా చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎర్ర సూరీడు..



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో గురువారం సాయంత్రం ఆకాశంలో ఎర్రతివాచీ పరుచుకుంది. అస్తమించే సమయంలో సూరీడు సింధూర వర్ణంతో అలరించాడు. దీంతో ఆకాశంలో సుందర దృశ్యం ఆవిష్కృతమైంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

మార్పు రావాల్సిందే...

- కార్పొరేషన్ పరిధిలో అమలు కాని పాలిథిన్ నిషేధం..
- 121 మైక్రాన్ల పాలిథిన్ ఉత్పత్తులను నిషేధించిన ప్రభుత్వం
- పట్టించుకోని వ్యాపారులు, ప్రజలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు



గుణుపూరుపేట డంపింగ్ యార్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

విజయనగరం: పాలిథిన్ ఉత్పత్తుల వినియోగం వల్ల ప్రజలతో పాటు ఇతర జీవాల ఆరోగ్యానికి ముప్పు కలగనున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటి వినియోగాన్ని నిషేధించింది. పాలిథిన్ కవర్లు, కప్పులతో పర్యావరణం దెబ్బతింటుందనే ఉద్దేశంతో కార్పొరేషన్ పరిధిలో వాటి విక్రయాలు, వినియోగాన్ని పాలకవర్గం రద్దు చేసింది. అలాగే పాలిథిన్ ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. అయితే ఎంత అవగాహన కల్పిస్తున్నా అటు వ్యాపారులు, ఇటు ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు ఉండడంతో అవగాహన లేక వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం క్షేమం కాదని తెలిసినా పట్టణవాసులు, విద్యావంతులు, ఉద్యోగులు కూడా అదే బాటలో వెళ్తుండడంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ చిన్న సరుకు కొన్నా పాలిథిన్ కవర్‌నే వినియోగిస్తున్నారు. హోటళ్లు, కర్రీ పాయింట్ల నుంచి వేడి ఆహార పదార్థాలు, కూరలు, సాంబారు, చాయ్, కాఫీలను కూడా కవర్లలో తీసుకురావడం విశేషం.

నిషేధంపై నిర్లక్ష్యం..

2022 జులైలో 75 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించగా.. డిసెంబరులో 121 మైక్రాన్ల లోపు ఉన్న ఉత్పత్తులను నిషేధిత జాబితాలో చేర్చింది. అయితే అధికారులు మొక్కుబడిగా ఒకటి, రెండు సమావేశాలు నిర్వహించి ఇక బాధ్యత తీరి పోయిందని మిన్నకుండిపోవడంతో పాలిథిన్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికారుల తనిఖీలు, జరిమానాలు నామమాత్రమే అయ్యాయి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజూ 125 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా...అందులో 30 నుంచి 40 మెట్రిక్ టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నట్లు సమాచారం.

మారితేనే సాధ్యం...

పాలిథిన్ నిషేధంపై అధికారులు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకొచ్చి ఉద్యమంలా ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరముంది. ప్లాస్టిక్ ప్రభావంతో జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలి. దుకాణదారులు, హోటళ్ల యజమానులు, కూరగాయలు, పండ్ల విక్రేతలతో అధికారులు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

అనారోగ్య సమస్యలు..

పేపర్ టీ కప్పు, విస్తరాకులపై పలుచని పాలిథిన్ పొర ఉంటుంది. వేడి పదార్థాలు వేసినప్పుడు ఆ పొర కరిగి ఆహారంతో పాటు కడుపులోకి చేరుతుంది. తద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదముందని నిపుణులు చెబుతున్నారు. వేడి పదార్థాలు, పాలు, పెరుగు వంటి వాటికి డబ్బాలు, గిన్నెలు.. భోజనానికి పళ్లాలు వినియోగించాలని సూచిస్తున్నారు.

పాపం.. పశువులు..

కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులు, విస్తరాకులను నిర్లక్ష్యంగా పడేయడంతో పశువులు వాటిని తినేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు జీర్ణం కాక అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల పశువులకు శస్త్ర చికిత్సలు చేసి కిలోల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలను తీసిన సంఘటనలున్నాయి. మానవ తప్పిదాలు మూగ జీవాల పాలిట శాపంగా మారకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

చర్యలు తీసుకుంటాం ..

ప్లాస్టిక్ నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యామ్నాయం వైపు ప్రజలు అలవాటు పడేలా అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకోసం ర్యాలీలు నిర్వహిస్తున్నాం. ఇదివరకు తనిఖీలు చేపట్టి పలువురికి జరిమానాలు విధించాం. నిషేధిత ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పిస్తాం. వ్యాపారులు సహకరించాలి.

- ఆర్. శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

దేవుని ప్రేమ పొందడం అదృష్టం



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ అలజంగి రవికుమార్

విజయనగరం టౌన్: దేవుని ప్రేమ పొందడం మనందరి అదృష్టమని ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. శిలువ శక్తి మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉపవాస దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 22 నుంచి ఏప్రిల్ 7 వరకు ఉపవాస దీక్షలను పాటిస్తూ గుడ్ ఫ్రైడే వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో ప్రత్యేక ఆరాధనలు చేశారు. కార్యక్రమంలో క్రీస్తు ఆరాధకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

26న విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలోని గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఈనెల 26న విజయభావన సాహితీసదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రంగస్థలం - పౌరాణిక నాటకం' అనే అంశంపై ప్రఖ్యాత పౌరాణిక నటుడు గన్నవరపు వెంకట సూర్యనారాయణమూర్తి ప్రసంగిస్తారన్నారు. సాహితీవేత్తలందరూ హాజరుకావాలని కోరారు.

పార్టీ బలోపేతానికి పని చేయాలి



కొండబాబును అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

పార్టీ అధిష్ఠానం నూతనంగా ప్రకటించిన అనుబంధ విభాగాల్లో భాగంగా దివ్యాంగుల విభాగానికి అధ్యక్షుడిగా నియామకమైన దవడ కొండబాబు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, అన్ని రంగాల్లో పార్టీ బలోపేతమైనప్పుడే రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించగలమన్నారు. దివ్యాంగులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని సూచించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ అధ్యక్షురాలు దవడ మీనా, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం: రోటరీ క్లబ్ సెంట్రల్ విజయనగరం డిస్ట్రిక్ట్-3020 ఆధ్వర్యంలో రోటరీ డే సందర్భంగా గురువారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. స్థానిక రోటరీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన శిబిరంలో 42 మంది దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కృష్ణగోపాల్ అగర్వాల్ మాట్లాడుతూ, రానున్న వేసవిలో రక్త నిల్వల కొరత లేకుండా రోటరీ తమవంతు సామాజిక బాధ్యతగా ఈ శిబిరం నిర్వహించిందన్నారు. రక్తదానం పట్ల అపోహలు విడనాడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మనోజ్, సర్వీసెస్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, బ్లడ్ డొనేషన్ క్యాంప్ చైర్మన్ నాగేశ్వరరావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని గాజులరేగలో రమా సత్యనారాయణ స్వామివారి ఆలయం పునః ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అభిషేకాలు చేపట్టారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సత్యనారాయణస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ నిర్వాహకులు, గాజులరేగ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పెనుమత్సకు అభినందనలు



ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబుకు అభినందనలు తెలియజేస్తున్న నాయకులు



సురేష్‌బాబుకు అభినందనలు తెలియజేస్తున్న సాంబశివరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబుకు భోగాపురం, గుర్ల, నెల్లిమర్ల మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో మొయిదలోని సురేష్‌బాబు స్వగృహానికి జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు కేవీ సూర్యనారాయణరాజు, కాకర్లపూడి శ్రీనివాసరాజు, డీఎల్ రెడ్డి, మట్టా అయ్యప్పరెడ్డి, దంతులూరి గిరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు తరలివచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంచాన సూరిబాబు పాల్గొన్నారు.

నగర పంచాయతీ నాయకుల అభినందనలు..

నెల్లిమర్ల: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుకు నెల్లిమర్ల నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలియజేశారు. రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం లభించడంతో వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్ కారుకొండ వెంకటకృష్ణరావు, మైపాడ ప్రసాద్, కారుకొండ హరీష్, పైల మురళి, మన్యపురి మోహనరావు, బూర సత్యనారాయణ, బంగారు శంకరరావు తదితరులు ఎమ్మెల్సీని అభినందించారు.

బకాయిదారులను ఉపేక్షించేది లేదు..

- అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు

విజయనగరం: పన్నుల విషయంలో మొండి బకాయిదారులను ఉపేక్షించేది లేదని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు అన్నారు. 2022 - 23 ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో మొండి బకాయిలను వసూలు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది రంగంలోకి దిగారు. ఈ మేరకు సహాయ కమిషనర్ ప్రసాదరావు, రెవెన్యూ సిబ్బందితో పూల్‌బాగ్ ప్రాంతంలో గురువారం పర్యటించారు. మొండి బకాయిదారులకు నోటీసులు అందజేశారు. అనంతరం స్థానిక సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. సచివాలయాల వారీగా బృందాలు ఏర్పాటు చేసి పన్ను వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 43 కోట్ల 49 లక్షల 26 వేల రూపాయల పన్ను వసూళ్ల లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 24.58 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు చెప్పారు. మిగిలిన పన్నులు త్వరితగతిన వసూలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెవాసులకు... ఉపాధి

- మండలంలో జోరుగా ఉపాధి పనులు
- 2022- 23 ఆర్థిక సంవత్సరంలో రూ. 11.18 కోట్లు ఖర్చు
- 57 పనులు పూర్తి, కొనసాగుతున్న 627 పనులు



గుంకలాంలో చెరువు పనులు చేపడుతున్న వేతనదారులు (ఫైల్)

విజయనగరం రూరల్: మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా (ఎన్ఆర్ఈజీఎస్) జోరుగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 717 పనులు మంజూరు కాగా ఇప్పటికే 57 పనులను పూర్తి చేశారు. బిల్లుల మంజూరు, కూలీలకు వేతనాల చెల్లింపుల్లో పారదర్శకత పాటించేందుకు ఎన్ఐసీ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి.

717 పనులు మంజూరు

మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 17.66 కోట్లతో 717 పనులకు ఆమోదం లభించింది. వీటికి సంబంధించి ఇప్పటికే 57 పనులు పూర్తి కాగా, 627 పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

14 పాఠశాలలకు రక్షణగోడలు

మండలంలోని ముడిదాం, గొల్లలపేట, గుండాలపేట, బియ్యాలపేట, చాకలిపేట, రామజోగిపేట, తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల చుట్టూ రక్షణ గోడలు నిర్మాణానికి రూ. 75 లక్షలు నిధులు మంజూరు కాగా, ఇప్పటివరకు ఆరు పనులు పూర్తి చేశారు. మిగతా పనులు నిర్మాణదశల్లో ఉన్నాయి.

రోజుకు 3 వేల మంది ..

మండలంలోని 22 గ్రామ పంచాయతీల నుంచి ప్రతీ రోజూ సుమారు మూడు వేల మంది వేతనదారులు ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు. వీరికి ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లిస్తున్నారు. గ్రామాల్లో సాగునీటి కాలువల్లో పూడికతీతలు, జగనన్న గృహ నిర్మాణం పనులు, మట్టి రోడ్ల నిర్మాణం, విలేజ్ పార్క్, శ్మశానవాటికల అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

పారదర్శకంగా పనులు



మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది మంజూరైన 717 పనులకు సంబంధించి కొన్ని పూర్తికాగా మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి. అభివృద్ధి పనులు, వేతనాలకు సంబంధించి ఇప్పటికే రూ. 11.18 కోట్ల చెల్లింపులు చేశాం.

- గంటా వెంకటరావు, ఎంపీడీఓ, విజయనగరం మండలం



బదుకొండపేటలో అభివృద్ధి చేసిన చెరువు



జొన్నవలసలో కోనేరు అభివృద్ధి పనులు చేపడుతున్న వేతనదారులు (ఫైల్)